

వణికిస్తున్న గాలివాన!

అకాల వర్షాలు రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. జిల్లాలోని పలు చోట్ల గాలివాన కురిసింది. 10లో▸



బైక్‌ను తప్పించబోయి..

బైక్‌ను తప్పించబోయి తవేరా వాహనం స్కూటీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. 10లో▸



బడిలో సౌకర్యాలు మెండు

ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్పాలంటూ బొంరాస్ పేట మండలం ఎన్కేపల్లిలో ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. 11లో▸

న్యూస్‌రీల్

అంకితభావంతో పని చేయండి
ఎస్పీ నారాయణరెడ్డి



పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లతో ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 17మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లగా ప్రమోషన్ వచ్చినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని తన చాంబర్‌లో పదోన్నతి పొందిన వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమోషన్ అంటే కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని.. బాధ్యత మరింత పెరిగిందని గుర్తుంచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో మరింత అంకితభావం, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

హామీలన్నీ అమలు చేస్తాం
స్పీకర్ ప్రసాద్ కుమార్



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు పథకం అమలు చేసినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని అన్నారు. త్వరలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.లక్షతోపాటు తులం బంగారం అందజేస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టామని, త్వరలో పథకం అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు నరోత్తం రెడ్డి, సుభాష్ గౌడ్, సురేందర్, సిరాజుద్దీన్, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఆర్ఐ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించాలి
బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన పలువురు నాయకులతో నూతన ఆస్పత్రిని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిలో వసతులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. భవనం పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందించి ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శివ రాజు, మోహన్‌రెడ్డి, సుధాకర్ ఆచారి, రాఘవేందర్, శ్రీనివాస్, రాములు, అనంతయ్య, గోపాల్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో పరిగి విద్యార్థి ప్రతిభ
ఆల్‌ఇండియా జనరల్ కేటగిరీలో 103 ర్యాంక్



ప్రణవ్‌తేజ్

పరిగి: జేఈఈ మెయిన్స్‌లో పరిగి విద్యార్థి సత్తాచాటాడు. ఆల్ ఇండియా జనరల్ కేటగిరీలో 103 ర్యాంక్ సాధించాడు. పరిగి టీచర్స్ కాలనీకి చెందిన కనకం ప్రణవ్‌తేజ్ జేఈఈ మెయిన్స్‌లో 300 మార్కులకు గాను 280 మార్కులు సాధించాడు.



వికారాబాద్‌లోని బీజేఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్

సాక్షి పరిశీలన

ట్రాఫిక్ నిత్యకృత్యం

మున్సిపాలిటీల్లో రోజురోజుకూ తీవ్రమవుతున్న సమస్య

- కానరాని సిగ్నల్ వ్యవస్థ
- ఆక్రమణలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు
- జిల్లాకు మంజూరుకాని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
- లా అండ్ ఆర్డర్ పోలీసులపైనే వాహనాల నియంత్రణ భారం

వికారాబాద్: జిల్లాలోని మున్సిపల్ కేంద్రాల్లో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. ఐదేళ్ల నుంచి ట్రాఫిక్ సమస్యలు ఉన్నా ఎవరూ పట్టించుకోడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని పదేళ్ల నుంచి పోలీసు శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా బుట్టదాఖలవుతున్నాయి. ఆయా పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం, ఉన్నవి కాస్త పని చేయకపోవడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో వికారాబాద్ పట్టణంలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా అవి కొద్దిరోజులకే మూలకు పడ్డాయి. పలు చోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికావడం, వ్యాపారులు రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేస్తుండటం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. జిల్లాలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేకపోవడంతో లా అండ్ ఆర్డర్ విధులు నిర్వహించే పోలీసులపైనే ఆ భారం పడుతోంది.

❖ జిల్లా కేంద్రంలో ఇదీ పరిస్థితి..

వికారాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఎన్టీఆర్, బీజేఆర్ చౌరస్తాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రామయ్య గూడ వెళ్లే దారిలో, ఆలంపల్లి రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్ చౌరస్తాలో, మహాశక్తి థియేటర్ వద్ద, గంగారం చౌరస్తాలో వాహనాల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంది. ఉదయం, సాయంత్రం స్కూల్స్, కళాశాలల సమయంలో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. ఎస్‌బీఐ, ఆలంపల్లి వద్ద రోడ్డుపైనే క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఈ ప్రాంతంలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను ఆపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ప్రతిపాదనలు పంపాం



జిల్లా కేంద్రం వికారాబాద్‌తోపాటు, తాండూరు, పరిగి మున్సిపాలిటీల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. చాలా వరకు వాటిని అధిగమిస్తున్నాం. త్వరలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

– నారాయణరెడ్డి, ఎస్పీ

❖ రోడ్లపైనే వాహనాల పార్కింగ్

పరిగి: పరిగి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. రోడ్లపైనే వాహనాలను నిలుపుతుండటంతో పాదచారులు, తోటి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ వ్యవస్థ లేదు. పరిగి పట్టణానికి నిత్యం పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. దీంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. మార్కెట్ రోడ్డు నిత్యం వాహనాలతో కిటకిటలాడుతుంటాయి. గంజ్‌రోడ్డు, బహార్‌పేట్ మార్కెట్ రోడ్డు, కొడంగల్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి శుక్ర, శనివారాల్లో వారంతపు సంతలు జరుగుతుంటాయి.. ఈ సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.



పరిగి పట్టణంలోని కొడంగల్ చౌరస్తాలో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనాలు

❖ సిగ్నల్స్ ఊసేలేదు



అంబేడ్కర్ చౌరస్తాలో వెలగని సిగ్నల్స్

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలో ఒక్క ట్రాఫిక్ సిగ్నల్ కూడా లేదు. పట్టణం మీదుగా రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ రెండూ కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కలుస్తాయి. పట్టణంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ – బీజాపూర్, మహబూబ్‌నగర్ – చించోలీ జాతీయ రహదారులపై భద్రత కరువైంది. రోడ్డు ప్రమాదాల నివారణకు హైవే పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయిందని బాధితులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో సిగ్నల్స్ వ్యవస్థ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో సుమారు పది మంది ప్రమాదాల బారిన పడ్డారు. కొందరు చనిపోగా.. మరికొందరు గాయాలపాలయ్యారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారు సంఖ్య కూడా పెరిగింది. పట్టణంలో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. వాహనాలను ఎక్కడ పడితే అక్కడే నిలుపుతున్నారు. వ్యాపార సముదాయల ముందు వాహనాలను ఇష్టారాజ్యంగా నిలపడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. బస్టాండ్ ముందు, వినాయక చౌరస్తాలో ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాఠశాలలు, కళాశాలలు అక్కడే ఉన్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి



జాతీయ రహదారిపై సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అలాగే ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలి. కొడంగల్‌లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది చనిపోతున్నారు. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి.

– మురహరి, కొడంగల్ వాసి

❖ అలంకారప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ

తాండూరు: పట్టణంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదు. దీంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2017లో పట్టణంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల పాటు అవి బాగానే పని చేశాయి. ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడంతో 2021 నుంచి పని చేయడం లేదు. అప్పటి నుంచి ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రోడ్ల పక్క వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆయా మున్సిపాలిటీల ప్రజలు కోరుతున్నారు.



తాండూరులోని ఇందిరా చౌక్‌లో సిగ్నల్స్ వ్యవస్థ పని చేయకపోవడంతో ట్రాఫిక్ జామ్



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

‘భూ భారతి’తో భూ సమస్యలకు
శాశ్వత పరిష్కారం

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- మర్పల్లి రైతు వేదికలో కొత్త చట్టంపై అవగాహన సదస్సు

మర్పల్లి: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నరు. శనివారం మర్పల్లి రైతు వేదికలో ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త చట్టం ద్వారా భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్, నిషేధిత భూములు, మార్పులు, చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే సమస్య ఉండదన్నారు. అధికారులే గ్రామాలకు వచ్చి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అంతకుముందు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ భారతి చట్టం పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రతి మండలానికి ఐదు మంది సర్వేయర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని పలువురు లబ్ధిదారులకు కలెక్టర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ మునిరొద్దీన్, ఆర్ఐ మాధవరెడ్డి, ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, ఏఓ శ్రీకాంత్, ఏఈఓలు నీరజ, మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్ దవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్, బ్లాక్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్, గణేష్, కార్యదర్శి సంజీవరెడ్డి, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు రఫీ, రాచన్న, లక్ష్మారెడ్డి, అశోక్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు మల్లికార్జున, గిరి, అశోక్, గోపాల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు వరుణ గండం

- అకాల వర్షాలు, వడగళ్లకు దెబ్బతింటున్న పంటలు
- తడిసి ముద్దవుతున్న ధాన్యం
- గాలి తీవ్రతకు నేలకొరిగిన బొప్పాయి, అరటి చెట్లు
- మామిడి రైతుకు భారీ నష్టం

వికారాబాద్: అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దాదాపు 15 రోజులుగా జిల్లాలోని పలుచోట్ల గాలివాన, వడగండ్ల వర్షం పడుతోంది. గాలి తీవ్రతకు వరి, బొప్పాయి, అరట, మామిడి ఇతర పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ప్రస్తుతం వరి పంట చేతికొచ్చింది. పలు చోట్ల కోతలు ప్రారంభించారు. ఈ సమయంలో వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల వరి నూర్పిళ్లు జరుగుతున్నాయి. కళ్లాలు, రోడ్లపైన వడ్లను ఆరబోశారు. మరి కొన్ని చోట్ల పొలాల్లో కోతలు కోసి ఉంచారు. ఇలాంటి పరిస్థితుల్లో అకాల వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం ఎక్కడికక్కడ తడిసిపోతోంది. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర రాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి దాదాపు 15 వేల నుంచి 20 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది.

వర్షాలు పడితే మరింత నష్టం

ప్రస్తుతం యాసంగి పంటలు పూర్తిస్థాయిలో చేతికి వచ్చాయి. వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న పంటల కోతలు ప్రారంభమయ్యాయి. వడ్లను ఆరబోయడం, నూర్పిడి చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ తరుణంలో అకాల వర్షాలు పడుతుండటం ఆందోళన కలిగిస్తోందని రైతులు అంటున్నారు. వర్షాలు ఇలాగే పడితే పూర్తిగా నష్టపోతామని వారు పేర్కొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

వర్షాలు పడుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు ఆరబెట్టుకునేందుకు సౌకర్యాలు కల్పించాలని రైతులు అధికారులను కోరుతున్నారు. కళ్లాలు, రోడ్లపై ధాన్యం ఆరబోస్తే తడిసిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తే తిరిగి పంపుతారని, ఒక వేళ కొన్నా మద్దతు ధర రాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత సీజన్‌లో 92 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. 2.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



మర్పల్లి మండలం కొత్లాపూర్‌లో గాలి తీవ్రతకు దెబ్బతిన్న బొప్పాయి పంట

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

జిల్లాలో ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాయి.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

హిందువులపై దాడులు అరికట్టాలి



రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విశ్వ హిందూ పరిషత్ విభాగ్ సహకార్యదర్శి బూరుగు రమణ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడికి నిరసనగా శనివారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్‌ఓ సంగీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ విభాగ్ సహకార్యదర్శి బూరుగు రమణ మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించడం పేరుతో బెంగాల్ మొత్తం హింసాకాండలో కాలిపోతోందని అన్నారు. బెంగాల్‌లో భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని నాశనం చేయడం ద్వారా తమ ప్రభుత్వాన్ని ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మమత ప్రభుత్వం చేస్తున్న కుట్రలన్నారు. హిందూ ఉనికికి ప్రమాదం వాటిల్లిందని, హిందువులకు భద్రత కల్పించాలన్నారు. బెంగాల్‌లో వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాలని, హింసపై ఎన్ఐఏతో విచారణ జరిపించాలని కోరారు.

త్వరలో ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా

కలెక్టర్ ప్రతీక్ జైన్



అనంతగిరి: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా లబ్ధిదారుల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయి అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసి, మే 2న గ్రామ పంచాయతీ, వార్డు కార్యాలయాల్లో జాబితాను ప్రదర్శిస్తారని తెలిపారు. మే 5న అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. మొదటి విడత పైలెట్ గ్రామాల్లో పునాది పనులు పూర్తి చేసుకున్నవారికి రూ.లక్ష చొప్పున వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. నాలుగు విడతలుగా రూ.5 లక్షలు అందుతాయని తెలిపారు. మొదటి విడతలో 2,285 మంది లబ్ధిదారులను గుర్తించామని.. 340 ఇళ్లకు మార్కింగ్ చేసినట్లు తెలిపారు. 45 మంది బేస్మెంట్ పనులు పూర్తి చేశారని.. 26 మందికి రూ.లక్ష చొప్పున సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారని పేర్కొన్నారు. మిగిలిన వారికి త్వరలో డబ్బులు అందుతాయని కలెక్టర్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో 15 మేకల మృతి



దోమ: వీధి కుక్కల దాడిలో 15 మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని మోత్కూర్‌లో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జీడీ అంజిలయ్య శుక్రవారం సాయంత్రం తన పొలంలోని షెడ్డులో మేకలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి భోజనం చేసి మళ్లీ పొలానికి వచ్చాడు. అప్పటికే వీధి కుక్కలు దాడి చేసి 15 మేకలను చంపేశాయి. సుమారు లక్ష రూపాయల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. అలాగే బొంపల్లి తండాలో నర్సింహులు చెందిన లేగదూడపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.

క్లుప్తంగా

వేటగాళ్లపై కేసు

ఆటో, వేట సామగ్రి స్వాధీనం



అటవీ శాఖ అధికారుల అదుపులో ఉన్న వేటగాళ్లు

ధారూరు: ఫారెస్టు రేంజ్ పరిధిలో ఓ అడవి పందిని చంపి తరలిస్తున్న ముఠాను అటవీ అధికారులు పట్టుకున్నారు. ఆటోతో పాటు నిందితులపై కేసు నమోదు చేశారు. ఫారెస్ట్ రేంజర్ రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బంట్వారం మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అడిమోల్ల వెంకటేశం, తిమ్మాపురం రాజు, గడ్డమీది రమేశ్, గంజెడి ముత్యాలు, ప్రశాంత్, మణెయ్య, రాజేశ్, జి.మారుతి కలిసి టీఎస్ 34 టీబీ 2964 నంబర్ ఆటోలో శనివారం నాగసముందర్ ఫారెస్ట్‌లోకి వెళ్లారు. ఈ క్రమంలో ఓ అడవి పందిని వేటాడి చంపారు. దీన్ని ఆటోలో తరలించేందుకు తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భాగమ్మ, బీట్ ఆఫీసర్ మధుకర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆటోతో పాటు వేటకు ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

తప్పని కరెంట్ కష్టాలు

జనరేటర్ సహాయంతో సెల్‌ఫోన్లకు చార్జింగ్



బండమీది పల్లిలో జనరేటర్ సహాయంతో సెల్‌ఫోన్లకు చార్జింగ్

తాండూరు రూరల్: ఈదురు గాలులతో కురిసిన వర్షానికి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో కరెంట్ కష్టాలు తప్పడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం బండమీది పల్లి గ్రామంలో జనరేటర్ సహాయంతో ఓ కాలనీలో బోరు మోటారును ప్రారంభించారు. బోరు మోటారు నుంచి మహిళలు తాగునీరు తెచ్చుకున్నారు. సెల్‌ఫోన్లకు కూడా చార్జింగ్ లేకపోవడంతో జనరేటర్ సహాయంతో తాత్కాలికంగా బోర్డులు ఏర్పాటు చేసుకుని కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. ఈ బోర్డులకు సెల్‌ఫోన్ల పెట్టి చార్జింగ్ చేసుకున్నారు. ఈదుగు గాలులు వీస్తే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ధ్యానం ప్రతీ ఒక్కరికి అవసరం

దోమ: ధ్యానం, జ్ఞానం, క్రమశిక్షణ ప్రతీ ఒక్కరికి అవసరమని పత్రీజీ పితామహర్షి ఆనందగౌతమి అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో తట్టపర్తి వీర రాఘవరావుతో పాటు పీరమిడ్ మాస్టర్ అభిషేక్, బీజేపీ రాష్ట్ర నాయకులు కరణం ప్రహ్లాదరావుతో కలిసి ధ్యాన పీరమిడ్ మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాల్లో ప్రతిఒక్కరూ ధ్యాన పీరమిడ్‌ను అలర్చుకోవాలన్నారు. ధ్యాన పీరమిడ్ చేయడం వల్ల తమ జీవితంలో ఆధ్యాత్మికత పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీరమిడ్ మాస్టర్లు సుచరిత, జిల్లా బీజేపీ కార్యదర్శి మేకల యాదయ్య, మాజీ ఎంపీటీసీ విజయాంజనేయులు, గ్రామస్తులు సీతరాములు, వెంకటేశ్‌గౌడ్, రాజు, రామ్నాథ్, వేణు, అంజలి, బాబు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాలు అభివృద్ధి



ఇప్పాయిపల్లిలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో బీజేపీ నేతలు

కుల్కచర్ల: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఘణపురం వెంకటయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి, బండమీదితండాలో బూత్‌స్థాయి కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించేది కేంద్ర ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు విడుదల చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలిచేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పాయిపల్లి బూత్ అధ్యక్షుడు ప్రభాకర్, రాములు, బండమీదితండా బూత్ అధ్యక్షుడు సభావత్ మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్, పెరుమాళ్ల వెంకటేష్, పుట్టపాటి అంజిలయ్య, రామకృష్ణ, మల్లేశ్, శేఖర్, కేశవులు, లక్ష్మణ్, పాల్గొన్నారు.

వణికిస్తున్న గాలివాన!

అకాల వర్షాలు రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. జిల్లాలో పలు చోట్ల శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ధారూరు సంతకు కూరగాయలు తెచ్చిన రైతులు గంపలు వదిలేసి పక్కనున్న దుకాణాల్లోకి పరుగులు తీశారు. వికారాబాద్‌లో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. బంట్వారంతో పాటు నల్చత్రా పూర్‌లో గాలివాన అవస్థలు సృష్టించింది.



అనంతగిరి: వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం



బంట్వారం: కోట్‌పల్లిలో ఇంటిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం



ధారూరు: ధారూరు సంతలో కురుస్తున్న వర్షం

బైక్‌ను తప్పించబోయి..

- స్కూటీని ఢీకొన్న టవేరా
- ఒకరు మృతి పలువురికి గాయాలు

పరిగి: బైక్‌ను తప్పించబోయి టవేరా వాహనం స్కూటీని ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. పలువురికి గాయాలైన సంఘటన పట్టణ కేంద్రంలో సయ్యాద్‌మల్కాపూర్ దగ్గర శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పూడూర్ మండలం చెంచుపల్లి గ్రామానికి చెందిన తిరుమలయ్యతో పాటు 11మంది కుటుంబీకులు టవేరా వాహనంలో హన్వాడ మండలంలోని దేవాలయానికి బయలు దేరారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఈడ్గి గున్నమ్మ(50) ఆమె కుమారుడు శ్రీశైలంగౌడ్ ఇద్దరు స్కూటీపై కుల్కచర్ల మండలంలోని పాంబండ దేవాలయానికి బయలు దేరారు. సయ్యాద్‌మల్కాపూర్ గ్రామ సమీపంలో పెట్రోల్‌బంక్ ముందు వెళ్తున్న బైక్‌ను అతివేగంగా వచ్చిన టవేరా బైక్‌ను తప్పించబోయి స్కూటీని ఢీకొంది. దీంతో టవేరా వాహనం పల్టీ కొడుతూ పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. స్కూటీపై ఉన్న గున్నమ్మకు తీవ్రగాయాలు కాగా, టవేరా వాహనంలోని పది మందికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానికులు పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గున్నమ్మకు



స్కూటీని ఢీకొని పల్టీ కొట్టిన టవేరా

తీవ్ర గాయాలు కావడంతో వికారాబాద్‌లోని ఈశా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. టవేరా వాహనంలో ఉన్న వైష్ణవ్, ప్రవల్లిక, శివమణి, ఎల్లమ్మ, వెంకటేష్, తిరుమలయ్య, లక్ష్మీ, శిరీష, అంజమ్మతోపాటు డ్రైవర్ ప్రసాద్‌లకు గాయాలయ్యాయి. తవేరా డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పలువురు వాపోయారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎయిర్ బ్రేక్ ఫెయిల్..

- మొరాయించి ఆర్టీసీ బస్సు
- భయాందోళనకు గురైన ప్రయాణికులు

దోమ: ఎయిర్ బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో ఓ ఆర్టీసీ బస్సు మొరాయించింది. శనివారం పరిగి డిపోకు చెందిన బస్సు దోమ మండల కేంద్రం మీదుగా అయా గ్రామాలకు వెళ్లేందుకు వస్తుంది. దోమ సమీపంలోకి రాగానే ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా బస్సు ఎయిర్ బ్రేక్‌లు ఫెయిల్ అయ్యాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును సురక్షితంగా ఆపేశారు. సుమారు 40 మంది ప్రయాణికులు బస్సులో ప్రయాణిస్తున్నారని, ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారని వారు పేర్కొన్నారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును ఆపేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

కాలం చెల్లిన బస్సులను తొలగించండి

ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను వెంటనే తొలగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి బస్సులతో అనుకోని ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులో భద్రత ఉంటుందని గొప్పలు చెబుతున్నారే కానీ, కాలం చెల్లిన బస్సులతో సంభవించే ప్రమాదాలను గుర్తించలేకపోతున్నారని చెబుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికైన అధికారులు కాలం చెల్లిన బస్సులను తొలగించి నూతన బస్సులను నడిపించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.



మొరాయించిన ఆర్టీసీ బస్సు

భూ సమస్యల పరిష్కారానికే కొత్త చట్టం

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్



బంట్వారం: మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్

బంట్వారం: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి పేరిట కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకొచ్చిందని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. శనివారం బంట్వారం రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు తమ భూములపై జవాబుదారి తనాన్ని ప్రభుత్వం పెంచేందుకే కొత్త చట్టాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు, చేర్పులు, సాధా బైనామాలు లాంటి సేవలు సులభతరం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుదేవ చంద్రా, తహసీల్దార్ విజయ్‌కుమార్, మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేషం, మాజీ ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సంతోష తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో ఆల్ హెల్ప్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగ విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. అలాగే ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి జయసుధ, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

తాండూరు: పట్టణంలో వెలసిన భావిగి భద్రేశ్వర స్వామి జాతరలో భాగంగా శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పట్టణంలో కలశంతో శోభాయాత్ర నిర్వహించారు. మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తెచ్చి రథంపై ప్రతిష్ఠించారు. పూర్ణకుంభం, మహా మంగళ హారతితో రథాన్ని ముందుకు కదిలించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో అలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహరాజ్, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునితా సంపత్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మురళీకృష్ణగౌడ్, రమేష్ కుమార్, పట్లోళ్ల నర్సింహులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదానం

తాండూరు: తాండూరు భావిగి భద్రేశ్వరస్వామి దేవాలయ దసోహ భవనంలో శనివారం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నదానం ఏర్పాటు చేశారు. జాతరోత్సవాల సందర్భంగా శుభప్రద్‌పటేల్ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాసోహ భవనంలో అన్నదానం ప్రారంభించారు.



కలశాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

విజయవంతం చేయాలి

అనంతగిరి: ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ తెలిపారు. ఈ మేరకు శనివారం వికారాబాద్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, తేజ, సిద్ధు, రెహాన్, కార్తీక్, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను జయప్రదం చేయండి

దౌల్తాబాద్: హనుమకొండ జిల్లాలో ఈ నెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో రజతోత్సవ సభకు సంబంధించి వాల్‌రైటింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ప్రజలను విస్మరించిందన్నారు. ఈ సభకు మండలం నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీరేందర్, శివకుమార్, కృష్ణ, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబాలకు అండగా ఉంటాం

దోమ: దళిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎంపీటీసీ రాములు అన్నారు. శనివారం బొంపల్లి గ్రామంలో కోళ్ల భీమమ్మ (95) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన గ్రామ దళిత సంఘాల నేతలతో కలిసి మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి రూ.200లు చొప్పున సేకరించి మొత్తం రూ.16వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుడు రామన్నమాదిగ, బొంపల్లి బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ డి. వెంకటేశ్, బొంపల్లి దళిత సంఘం నేతలు టి.శ్రీనివాస్, మల్లేశ్, రాములు, నర్సింహులు, కోళ్ల నర్సింహులు, పి. మహేశ్, కృష్ణ, ఆనందం, కె. అశోక్, అనంతయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

దుద్యాల్: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మేరుగు వెంకటయ్యలు అన్నారు. శనివారం రాత్రి దుద్యాల్ గ్రామంలోని రెండు ప్రధాన చౌరాస్తాలో రెండు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెలు, పట్టణాలు, గూడెంలు కాంగ్రెస్‌తోనో అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు సత్యానారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పాలన విధించాలి

అనంతగిరి: పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడ జరుగుతున్న ఘటనలు చూస్తుంటే కుట్రపూరితంగా దాడులు చేస్తున్నట్లు ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. లేనియెడల కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు బందెప్పగౌడ్, రమేష్, ప్రభాకర్, విద్యాసాగర్, దత్తు, శశిధర్‌రెడ్డి, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారికి చికిత్స

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: పాఠశాల గది పై కప్పు నుంచి పెచ్చులూడిపడి తీవ్రంగా గాయపడ్డ విద్యార్థినికి పరీక్షలు చేయించి, మెరుగైన వైద్యం అందించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశించారు. శనివారం మున్నూరుసోమారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌కు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. ‘శిరీషకు మెరుగైన వైద్యం అందించాలి’ శీర్షికతో శుక్రవారం సాక్షి ప్రచురితమైన కథనాన్ని చూసిన స్పీకర్ రవీందర్‌కు ఫోన్ చేశారు. దీంతో శనివారం ఉదయాన్నే రవీందర్ తన కారులో శిరీషను వికారాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ఘటన జరిగి మూడు రోజులైనా చిన్నారికి గాయాలు తగ్గలేదని, ఆరోగ్యం క్షీణించిందని తెలిపారు. డీఈఓతో పాటు విద్యాశాఖ అధికారులు చుట్టపు చూపులా వచ్చి వెళ్లారని, బాలికకు కనీస వైద్యం చేయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ చొరవపై బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు. ‘సాక్షి’కి ధన్యవాదాలు తెలిపారు.



స్పీకర్‌తో ఫోన్ మాట్లాడుతున్న వైద్యురాలు

కంపు తొలగింది

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ మత్స్యకార భవనం ఎదుట మురుగు కాల్వలు నిండి దుర్గంధం వెదజల్లింది. ఈ కంపు భరించలేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇదే విషయమై సాక్షిలో ‘వామ్మో.. కంపు’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి శనివారం జేసీబీ, పంచాయతీ కార్మికుల సాయంతో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూడదని ప్రజలకు సూచించారు.



మురుగు కాల్వలో మురుగు తొలగిస్తున్న పంచాయతీ కార్మికుడు



జేసీబీ సహాయంతో మురుగును తొలగిస్తున్న దృశ్యం

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

తాండూరు తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: తెలంగాణ ఓపెన్ టెన్త్, ఇంటర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని తాండూరు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జీజేసీ) పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..నేటి నుంచి 26వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. తాండూరు పట్టణంలో ఓపెన్ టెన్త్‌కు సెయింట్ మార్క్స్ స్కూల్, ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జీజేసీ), సాయిపూర్‌లోని నంబర్ 1 ప్రభుత్వ పాఠశాల, పాత తాండూరులోని ప్రభుత్వ బాలికల ఉర్దూమీడియం పాఠశాల పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30గంటలనుంచి, సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. నలుగురు చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్స్‌లతో పాటు 40 మంది ఇన్విజిలెటర్లను ప్రభుత్వం నియమించిందన్నారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ వెంకటయ్య, డిపార్ట్‌మెంట్ అధికారులు లక్ష్మయ్య, నసీమున్నీసా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

పని ప్రదేశంలో ఉపాధి కూలీ మృతి

తాండూరు రూరల్: ఉపాధి హామీ కూలీ గుండెనొప్పితో మృతి చెందాడు. ఈ ఘటన పెద్దేముల్ మండలం దుగ్గాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె పెద్ద అమృతయ్య(59) వ్యవసాయం చేస్తూ జీవిస్తుంటాడు. వేసవికాలం దృష్ట్యా పనులు లేకపోవడంతో గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాడు. ఇందులో భాగంగా శనివారం ఉదయం తోటి కూలీలతో కలిసి పని చేస్తుండగా గుండెలో నొప్పి వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని తాండూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఆరుగురు పిల్లలు ఉన్నారు.



అమృతయ్య (ఫైల్)

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ఉపాధి కూలీ అమృతయ్య కుటుంబానికి ప్రభుత్వం నుంచి చేయూత అందేలా చూస్తామని ఎంపీడీఓ రతన్‌సింగ్ అన్నారు. ఆయన మృతి విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశామని తెలిపారు. కూలీలు ఎండబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి

మర్పల్లి: పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి రైతులకు భరోస ఇచ్చారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన కొలు రైతు వెంకటేశం రెండెకరాల్లో బొప్పాయి, మరొ రెండెకరాల్లో అరటి పంట సాగు చేశాడు. అవీ వర్షానికి పాడయ్యాయి. విషయం తెలుసుకున్న మార్కెట్ చైర్మన్ మహేందర్‌రెడ్డి స్థానిక నాయకులు, వ్యవసాయ అధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించేవిధంగా కృషి చేస్తామని రైతు వెంకటేశానికి భరోస ఇచ్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్, ఉద్యాన శాఖ మర్పల్లి, నవాబ్‌పేట్, మోమిన్‌పేట్ క్లస్టర్ అధికారి అర్పితరెడ్డి, సిరిపూరం రైతు వేదిక క్లస్టర్ ఏఈఓ మహేశ్, మాజీ సర్పంచ్ రాములు, కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంతారంలో వరిపంట పరిశీలన

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. వడగండ్ల వానతో మండలంలోని అంతారం, బెల్కటూర్, ఎల్మకన్నె, అల్లాపూర్ గ్రామాల్లో వరిపంట పాడైపోయాయి. విషయం తెలుసుకున్న అంతారం క్లస్టర్ ఏఈఓ శివకుమార్ శనివారం అంతారం గ్రామంలోని నక్కల రాజు వరిపంటను పరిశీలించారు. దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.



మర్పల్లి: అరటి, బొప్పాయి పంటలను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

ధారూరులో..

ధారూరు: మండలంలోని అల్లాపూర్, నాగసముందర్ గ్రామాల్లో శుక్రవారం కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న వరి పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి హరిప్రసాద్‌గౌడ్ శనివారం పరిశీలించారు. రైతుల పొలాలకు నేరుగా వెళ్లి ఏ ఏ పంట ఎంతమేరకు నష్టపోయిందో నమోదు చేసుకున్నారు. నష్టం వివరాలను జిల్లా వ్యవసాయ కార్యాలయానికి పంపిస్తామని హరిప్రసాద్‌గౌడ్ తెలిపారు.